క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని బస్‌స్టాండ్ రోడ్డు, సుభాష్ కాలనీ, రామ్‌నగర్, ఎల్‌బీనగర్, లక్ష్మీనగర్, రెడ్డికాలనీ, గాంధీ కాలేజీ రోడ్డు, బానోత్ వీధి ప్రాంతాలల్లో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని భూపాలపల్లి ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ రాంనగర్ ఫీడర్‌పై చెట్ల కొమ్మలు కొట్టుటకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మహదేవపూర్‌లో..

కాళేశ్వరం: మహదేవపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు నేపథ్యంలో నేడు (ఆదివారం) బొమ్మాపూర్, ఎలికేశ్వరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



మొగుళ్లపల్లి: వెలుగు మండల సమాఖ్య ఏపీఎంగా జక్కు రమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పని చేసిన అంబాల రవివర్మ జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలంలో పనిచేసిన రమాదేవి ఇక్కడికి వచ్చారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న మల్లయ్య

టేకుమట్ల: ఏవైఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని కుందనపల్లి గ్రామానికి ఆరకొండ రాజయ్యను నియమించినట్లు ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. తనకు నియోజకవర్గ కన్వీనర్‌గా అవకాశం కల్పించిన ఏవైఎస్ నాయకులకు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. మారెపెల్లి కొమురయ్య, కొలుగూరి కైరత్, ఆరకొండ రాకేశ్ ఉన్నారు.

ఎంపీడీఓకు సిల్వర్ మెడల్

కాటారం: నీతి అయోగ్‌లో భాగంగా మహాముత్తారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో నిర్వహించిన సంపూర్ణ అభియాన్ రాష్ట్రస్థాయి అవార్డుల్లో భాగంగా ఎంపీడీఓ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

మల్హర్: గ్రంథాలయ జిల్లా చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన కోట రాజబాబును మండల కేంద్రం తాడిచర్లలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, ఇందారపు చంద్రయ్య, బొబ్బిలి రాజు, ఉదయ్, సురేష్‌రావు, ఆకుల శ్రీనివాస్, రాజసమ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల ఆదాయ, వ్యయాలపై ఆర్టీఐ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానంలో మే నెల 15 నుంచి 26 వరకు రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సరస్వతీనది పుష్కరాలను నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, పుష్కరాలకు ప్రభుత్వం రూ.35కోట్ల వరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు, ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ ఆదాయ, వ్యయాలపై మంథని నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆర్టీఐ(సమాచారం హక్కు చట్టం) దరఖాస్తును రిజిస్టర్ పోస్టు ద్వారా ఇటీవల పంపించారు. ఈ విషయంపై ఈఓ ఎస్.మహేశ్‌ను సంప్రదించగా.. దరఖాస్తు వచ్చిన విషయం నిజమే అన్నారు. కాగా, సమాచారం ఇంకా పంపలేదని తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా బయటికి రావడంతో చర్చ జరుగుతోంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రేగొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని కనిపర్తిలోని చలివాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసంపూర్తిగా హెల్త్ సబ్‌సెంటర్

- నిధులు లేక నిలిచిన నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



టేకుమట్లలో అలంకారప్రాయంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

టేకుమట్ల: గత ఏడాది నేషనల్ హెల్త్ మిషన్ నిధుల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.20లక్షల నిధులను కేటాయించింది. దీంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి స్థాయిలో చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. విద్యుత్, పెయింటింగ్ పనుల కోసం మరో రూ.మూడు లక్షలు ప్రభుత్వం కేటాయిస్తే పూర్తి స్థాయిలో భవనం వినియోగంలోకి వస్తుంది. కానీ నిధులు కేటాయించకపోవడంతో కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో అరకొర వసతుల నడుమ కొనసాగిస్తున్నారు. వైద్య సిబ్బంది, ప్రజలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి నిధులు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయిస్తే పూర్తి చేస్తా..



మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పూర్తి చేయాలంటే మరో రూ.3 లక్షల నిధులు కావాలి. నిధులు కేటాయిస్తే భవనానికి పెయింటింగ్, విద్యుత్ పనులు చేసి పూర్తి చేస్తా. అదనపు నిధుల కోసం స్థానిక ఎమ్మెల్యే సత్యనారాణరావును కలిసినా ఇప్పటివరకు నిధులు అందలేదు. జిల్లా అధికారులు స్పందించి నిధులు కేటాయించాలి.

– బండెల నరేశ్, కాంట్రాక్టర్, టేకుమట్ల

ఇబ్బంది పడుతున్నాం..



సబ్‌సెంటర్‌కు ప్రత్యేక భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీలోని ఒక గదిని కేటాయించారు. అరకొర వసతుల నడుమ ఇబ్బంది పడుతున్నాం. నూతన భవనాన్ని పూర్తి చేసి కేటాయిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– భాగ్య, ఏఎన్‌ఎం, టేకుమట్ల

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



భూపాలపల్లి అర్బన్: బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



రేగొండ: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎమ్మెల్యే శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా రూ.3.10కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఆధునిక సీటీ స్కాన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఈ యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆస్పత్రిని 300 బెడ్స్‌కు పెంచుతామని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో వైద్యాన్ని నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపించారు. అనంతరం ఆస్పత్రిలోని ప్రతీ వార్డు తిరుగుతూ రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

రేగొండ: విద్యారంగానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేని గత పాలకులు ఇప్పుడు హాస్టళ్లను సందర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు భిక్షపతి, గండి తిరుపతి, వీరబ్రహ్మం, ఏనుగు రవీందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు



హెల్త్‌క్యాంపును ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు

భూపాలపల్లి అర్బన్: కోర్టులో పనిచేసే న్యాయవాదులు, ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేష్‌బాబు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో శనివారం హెల్త్ క్యాంపు నిర్వహించగా రమేశ్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక యుగంలో బిజీ జీవితాలను గడుపుతున్న తరుణంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌రావు, ఏఓ అనితావని, మెడికవర్ హాస్పిటల్, శరత్ కంటి ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో బీఎంఎస్ రాజీలేని పోరాటం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంస్థ అభివృద్ధికి బీఎంఎస్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని బీఎంఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ తెలిపారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం ఏరియాలోని కేటీకే 6వ గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అప్పాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి, బొగ్గు పరిశ్రమల రక్షణ కోసం చేపట్టే పోరాట కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు విఫలమైనట్లు తెలిపారు. కార్మిక హామీలను విస్మరించి, సింగరేణి సంస్థలో ప్రభుత్వ అధికార బల, రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థను నిట్టనిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, మెరుగైన వైద్యంకోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోల్‌బెల్ట్‌లో నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పునీత్‌రావు, సుజంధర్, మల్లేష్, నరసింహారావు, శ్రవణ్‌కుమార్, కనకయ్య, ప్రవీణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కాటారం: అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో భాగంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి శనివారం తెలిపారు. 19 మంది విద్యార్థినులు ఆయా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవగా 13 మంది విద్యార్థినులు రెండో స్థానంలో 8 మంది విద్యార్థినులు మూడో స్థానంలో నిలిచారన్నారు. హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నేటి (ఆదివారం) నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఎస్వీపి కల్పన, పీడీ గౌతమి, పీఈటీ శ్రీవిద్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన



టేకుమట్ల: తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

టేకుమట్ల: తల్లిపాలు తాగించడంతోనే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. శనివారం మండలంలోని వెలిశాల సెక్టార్ రామకిష్టాపూర్(వి)లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజన మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకి తప్పనిసరిగా ముర్రుపాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ సెంటర్ టీచర్ చింతల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు తాగించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు కొనసాగిస్తూ అదనంగా బాలామృతం తినిపించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, టీచర్స్ సంధ్యారాణి, అరుణ, భాగ్యలక్ష్మి, సుజాత, జ్యోతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ జయశ్రీ



కాటారంలో..

ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం

కాటారం: ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అని పుట్టిన వెంటనే బిడ్డకు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముర్రుపాల ప్రాముఖ్యత, వాటి వల్ల కలిగే లాభాలు గుర్చి బాలింతలు, గర్భిణులకు సూపర్‌వైజర్ అవగాహన కల్గించారు. ఆరు నెలల వరకు తల్లిపాటు పట్టించాలని ఎట్టి పరిస్థితుల్లో నీరు తాగించకూడదని తెలిపారు. పిల్లలను ఎప్పటికప్పుడు బరువులు చూసి పోషణ స్థితిని పెంచడానికి తల్లులకు సూచనలు చేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అదనపు గదులు మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని శనివారం మండలానికి వచ్చిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రిన్సిపాల్ విజదేవి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి అదనపు తరగతి గదుల ఏర్పాటుకు కృషి చేస్తాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

భూ కబ్జాకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేశ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో నకిలీ పత్రాలతో భూ కబ్జాకు పాల్పడిన ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. మంజూర్‌నగర్‌లోని కేటీకే 8వ గని ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్ 172లో వారికి భూమి లేకపోయిన హనుమకొండకు చెందిన శ్రీరామోజు మహేందర్, కొంపల్లి గ్రామానికి చెందిన భూక్య సురేష్ తప్పుడు పత్రాలు సృష్టించినట్లు తెలిపారు. ఈ సర్వే నంబర్‌లో 20గుంటల భూమిని అమ్మినట్లు పత్రాలు సృష్టించి భూమి యాజమాని కోనారి రవీందర్‌ను బెదిరింపులకు గురిచేశారన్నారు. దీంతో రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైన భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పొనగండ్లలో దొంగల హల్‌చల్

రేగొండ: మండలంలోని పొనగండ్లలో రాజు ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు గ్యాస్ సిలిండర్‌ను దొంగిలించారు. వారం క్రితం గ్రామంలోని వంగ చిన్న ఐలక్క ఇంట్లో, గతంలో నాంపల్లి వనక్కకు చెందిన గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లారు. అలాగే రెండు నెలల క్రితం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేపించి కనక్షన్ ఇవ్వడానికి రైతులు తీసుకువచ్చారు. కానీ మరుసటి రోజు వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా పొలాల వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్ డబ్బాలను, విద్యుత్ తీగలను కట్ చేసి చోరీలకు పాల్పడ్డట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఎన్ని భద్రత చర్యలు తీసుకుంటున్నా, హెచ్చరికలు జారీ చేస్తున్న దొంగలు ఆగడం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

వాజేడు : మండలంలోని భువనపల్లి, ధర్మవరం, చింతూరు గ్రామ పంచాయతీల్లో పలు సమస్యలు పేరుకుపోయాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కోరకల్ నుంచి చింతూరు వరకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారిందని దానిని ఇంత వరకు మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ రహదారి వెంట ఉన్న 7 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా చింతూరు, ధర్మవరం, చెరుకూరు తదితర గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలపై ఈ నెల 5 వరకు పరిశీలన చేసి 6 నుంచి 11 వరకు గ్రామ పంచాయతీల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిచాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లాలో కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూఎస్‌పీసీ జిల్లా నాయకులు నక్క తిరుపతి, కొత్త కుమారస్వామి, సేవానాయక్, అశోక్, తిరుపతిరెడ్డి, రమ, ఈశ్వర్, పరమేశ్వర్, సుధాకర్, ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన ఆకుల ఓదేలు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు శనివారం పరామర్శించారు. ఓదేలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కుంట సదానందం ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య

రేగొండ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. రెండు సార్లు గెలిచిన నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిందేమి లేదని విమర్శించారు. జిల్లాలోని పోలీసులను కించపరిచినట్లు మాట్లాడటంపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, భిక్షపతి, గండి తినుపతి, వీరబ్రహ్మం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

వాజేడు: మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలను నిర్వహించారు. మావోయిస్టులు వారోత్సవాలు నిర్వహిస్తు న్న నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తువులపై ప్రత్యేక నిఘాను ఉంచారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూస్తున్నారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించడంతో పాటు ప్రయణికుల బ్యాగులను సోదాలు చేస్తున్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజ్‌కుమార్, పీఎస్సైలు నరేష్, రచిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291